నీరు నిల్వకుండా చర్యలు చేపట్టండి: డీసీ


కార్పొరేటర్లు, ఉన్నతాధికారులతో సమావేశమైన డీసీ తిప్పర్తి యాదయ్య

ఎల్‌బీనగర్: వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అధికారులను ఆదేశించారు. శనివారం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో సర్కిల్ కార్పొరేటర్లు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న బోనాలు పండుగ సందర్భంగా ప్రతీ ఆలయం వద్ద లైటింగ్ ఏర్పాట్లు, ఆలయాల వద్ద మొరం మట్టి, మరమ్మతులు, శానిటేషన్ పనులు చేపట్టాలని కార్పొరేటర్లు అధికారులను కోరారు. విద్యుత్ డిపార్ట్‌మెంట్ వారు కొట్టివేసిన చెట్టు కొమ్మలను ఎప్పటికప్పుడు తీసివేయాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమలను అరికట్టేందుకు ప్రతి కాలనీలో ఫాగింగ్ చేపట్టాలని అన్నారు. ప్రతి డివిజన్‌కు కొత్త వీధిలైట్లు మంజూరు చేయాలని కార్పొరేటర్లు అధికారులను కోరడం జరిగింది. జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీఎస్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, పావని, ఎస్‌డబ్ల్యూ ఎం డిప్యూటీ ఇంజినీర్ లావణ్య, వెటర్నరీ అధికారి యాదగిరి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మధుయాష్కీకి పీసీసీ అధ్యక్ష పదవి రావాలని ...


లింగోజిగూడ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగోజిగూడ: పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను పీసీసీ అధ్యక్ష పదవి వరించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కర్మన్‌ఘాట్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, లింగోజిగూడ దర్గాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ, మధుయాష్కీగౌడ్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌గౌడ్, ప్రేమ్‌నాథ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీ ప్రెస్‌కు గుర్తింపు తెచ్చిన వెంకటేశ్వర రావు

చాదర్‌ఘాట్: బ్రెయిలీ ప్రెస్‌కు గుర్తింపు తెచ్చిన వెంకటేశ్వరరావు సేవలు మరువలేనివని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ జనరల్ మేనేజర్ ప్రభంజనరావు కొనియాడారు. శనివారం మలక్‌పేటలోని ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన బ్రెయిలీ ప్రెస్ ఎడిటర్ వెంకటేశ్వర రావును శాలువాతో సత్కరించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ, అంధుల చదువు కోసం వెంకటేశ్వరరావు కొత్త టెక్నాలజీని రూపొందించారని, వారి కోసం 40 ఏళ్ల పాటు శ్రమించారని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఆయన సేవలను ఉపయోగించుకుంటామన్నారు.


బ్రెయిలీ ప్రెస్ ఎడిటర్ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న జీఎం ప్రభంజన రావు

కాలనీ సంఘాల భాగస్వామ్యంతోనే అభివృద్ధి


కాలనీ సంఘాల నాయకులతో సమావేశమైన కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీ, నాగార్జున కాలనీ, రాజిరెడ్డి నగర్, వెంకటరమణ, అనురాధా తదితర కాలనీలు ప్రతియేటా వరద ముంపు బారిన పడేవని, ఇటీవల చేపట్టిన ట్రంక్‌లైన్ నిర్మాణంతో ఆ సమస్య పరిష్కారమైందని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం రాజిరెడ్డినగర్‌లో ఆయా కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ట్రంక్‌లైన్ నిర్మాణం జరిగిన ఆయా కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.95 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. సాగర్ రహదారిపై డెల్టా ఆసుపత్రి నుంచి సాగర్ రింగ్ రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు ఉన్న ఓపెన్ నాలా ఆక్రమణలకు గురైందని, దానిని పునరుద్ధరించి కాలనీలకు వరద సమస్యను నివారిస్తామన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులు చేపడతామని, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు హరిందర్‌రెడ్డి, యాదవరెడ్డి, నవీన్‌కుమార్, రమేష్‌రెడ్డి, విష్ణుమూర్తి, కృష్ణయ్య గౌడ్, శంకర్, విజయ్, సతీష్, రాజు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలి


హయత్‌నగర్ ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం పరిసర ప్రాంతాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉన్న అధిక ఫీజులు, పాఠ్యపుస్తకాల పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శనివారం హయత్‌నగర్ మండల ఎంఈఓ హీర్యానాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పలు విద్యాసంస్థలు విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, పాఠ్య పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్నాయని అన్నారు. ఇక్కడ చదువుకుంటున్న వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు అని, పిల్లల భవిష్యత్ కోసం వారిని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తే ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని అన్నారు. నాయకులు సీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, నూతి శ్రీనివాస్‌రావు, తడకమళ్ల విజయ్ కుమార్, నాయిని శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని వినతి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీ మొదటి గేటు సమీపంలోని జీహెచ్ఎంసీకి చెందిన సెట్‌బ్యాక్ స్థలాన్ని కాలనీ పార్కుగా అభివృద్ధి చేయాలని కమలానగర్ కాలనీవాసులు శనివారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్(జెడ్సీ)ను కోరారు. కమిషనర్ కార్యాలయంలో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ సెట్‌బ్యాక్ స్థలాన్ని సదరు భవన నిర్మాణదారుడు తిరిగి ఆక్రమించేందుకు ఫెన్సింగ్ చేశాడని, ఆ స్థలాన్ని జీహెచ్ఎంసీ కాలనీ పార్కుగా అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి సత్యనారాయణ, కాలనీవాసులు శాంతికుమార్, ముజీబ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.


జెడ్సీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కమలానగర్ కాలనీవాసులు

రౌడీషీటర్లపై నిఘా



- అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు
- అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు
- ఆవారాగాళ్లపై ప్రత్యేక ఫోకస్

చాదర్‌ఘాట్: నగరంలో ఇటీవల కాలంలో పెరుగుతున్న హత్యలు, రౌడీషీటర్ల ఆగడాలను దృష్టిలో పెట్టుకొని నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సౌత్‌ఈస్ట్ జోన్ పోలీసులు నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలోకి వచ్చే చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత వారం రోజుల నుంచి అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.

- అర్ధరాత్రి రౌడీలు, ఆవారాగాళ్లు, గంజాయి బ్యాచ్ మద్యం మత్తులో వీరంగం చేస్తున్న వారితో శాంతి భద్రతలకు విఘాతం కలగడమే కాకుండా హత్యలు, దొమ్మీలు, దోపిడీలు, స్నాచింగ్‌లు జరుగుతున్నాయని భావించిన పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పక్కనబెట్టారు.
- పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోంగార్డు మొదలు ఏసీపీ, డీసీపీ వరకు రాత్రిపూట ఈ తనిఖీల్లో పాల్గొననున్నారు.


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ శ్యాంసుందర్

- ప్రతిరోజూ రాత్రి 10 నుంచి 12 గంటల వరకు శుక్ర, శని వారాల్లో రాత్రి 10 నుంచి ఒంటి గంట వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.
- ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని అన్ని వైపులా నుంచి పోలీసులు చుట్టుముట్టి అర్ధరాత్రి సంచరించే అనుమానితులను తనిఖీ చేస్తున్నారు.
- పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై దృష్టి పెట్టిన పోలీసులు.. వారిని స్టేషన్‌కు రప్పించి వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారు.
- రోజూ రౌడీషీటర్లు, తల్లిదండ్రులు లేదా, భార్యాపిల్లలు లేదా స్నేహితులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కౌన్సిలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఏదైనా కేసులో ఇరుక్కుంటే కఠిన చర్యలు తథ్యమని వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.
- కత్తులు, గంజాయి ప్యాకెట్లు, బ్లేడ్లు ఇతరత్రా మారణాయుధాలను కలిగి ఉండే వారిని అరెస్ట్ చేస్తున్నారు.
- బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపుల వద్ద కూడా అర్ధరాత్రి నిఘా పెడుతున్న పోలీసులు అనుమానితుల కదలికలను గమనిస్తున్నారు. ప్రజలకు శాంతి భద్రతలు అందించడం సామరస్య పూర్వక వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పోలీసులు ఈ కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 43, వంకాయ 35, బెండ 35, పచ్చిమిర్చి 70, కాకర 42, బీర 35, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 28, క్యారెట్ 40, దొండ 18, ఆలు 35, ఉల్లి 37, గోకర 45, దోస 23, సొర 09, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 65, అర్వి 35, మునగ 65, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 65. ఆదివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం


పురస్కారాలు అందుకున్న సిబ్బంది, చిన్నారులతో డీఎం హరి

చైతన్యపురి: ఏప్రిల్, మే నెలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆదర్శ ఉద్యోగులకు దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ సిటీ డిపోలో శనివారం ప్రగతిచక్రం పురస్కారాలు ప్రదానం చేశారు. డిపో మేనేజర్ హరి 26 మంది ఉద్యోగులకు నగదు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. సీఐ వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్, ఏడీసీ బుచ్చిరెడ్డి, ఎంఈఎ న్‌ఎల్ రావు, ఏఎస్‌రెడ్డి, వెల్ఫేర్ బోర్డు మెంబర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మలబార్‌లో 'నువ' డైమండ్ ఆభరణాల ప్రదర్శన


'నువ' ఆభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న సృజనారెడ్డి

చైతన్యపురి: చైతన్యపురిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో 'నువ' డైమండ్ ఆభరణాల ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి సతీమణి సృజనారెడ్డి వినియోగదారులతో కలిసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మలబార్ ఏ ఆభరణాల కలెక్షన్స్‌ను ప్రారంభించినా మగువలను ఆకర్షిస్తాయన్నారు. షోరూం హెడ్ రథీష్ , షోరూం సిబ్బంది, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

ఆక్రమణకు యత్నిస్తున్న స్థలం పరిశీలన



సహారా రోడ్డులో జీహెచ్ఎంసీ స్థలానికి వేసిన ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మన్సూరాబాద్: 'రూ.3 కోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం' అనే శీర్షికన 'సాక్షి' శనివారం ప్రచురించిన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ (విజిలెన్స్) ఏఈ సతీష్, హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం ఘటనా స్థలానికి చేరుకుని ఆక్రమణను పరిశీలించారు. కాలనీవాసుల నుంచి ఆక్రమణదారుల నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి అనుమతి తీసుకొనే సమయంలో జీహెచ్ఎంసీకి డీడ్ చేసిన స్థలంపై ఆ తర్వాత నిర్మాణదారునికి ఎలాంటి హక్కు ఉండదని అధికారులు తేల్చారు. గ్రీనరీ పేరుతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని కమలానగర్ కాలనీవాసులు అధికారులకు స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.

మూసీ సుందరీకరణ పనుల్లో జాప్యం వద్దు

అధికారులకు ఎమ్మెల్యే బలాల ఆదేశం

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో మూసీ నది సుందరీకరణ పనుల్లో భాగంగా సైదాబాద్, అంబర్‌పేట మండలాలకు చెందిన తహసీల్దార్ల ఆధ్వర్యంలో సోషల్ ఎకానమిక్ సర్వే(ఎస్ఈఎస్) చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల శనివారం పంజేషాహలోని కార్యాలయంలో రెవెన్యూ, జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారులతో మూసీ నది అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మూసారంబాగ్ తీగలగూడ నుంచి మూసారంబాగ్ బ్రిడ్జి వైపు సర్వే చేసినట్లు సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ తెలిపారు. జాప్యం లేకుండా మూసీ సుందరీకరణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సమావేశంలో సైదాబాద్ డిప్యూటీ తహసీల్దార్ దావూద్, అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ కిరణ్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.


మూసీ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

ఆలయంలో సేవలు చేయడం హర్షణీయం

చంపాపేట: శ్రీభమరాంబిక సేవా సమితి సభ్యులు కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో ఉచితంగా సేవలు చేసేందుకు రావటం హర్షణీయమని ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. శనివారం సేవా సమితి కోఆర్డినేటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 15 మంది మహిళా సభ్యులు ఆలయానికి వచ్చి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామివారి దర్శనం, టికెట్ కౌంటర్ క్యూలైన్ ఏర్పాటుతో పాటు తీర్థ, ప్రసాదాల పంపిణీ, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం వంటి సేవలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యుడు ఆనంద్‌గౌడ్, నాయకులు సదానందరెడ్డి, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.


సేవా సమితి సభ్యులతో ఆలయ కమిటీ చైర్మన్

వినాయక మండపం కూల్చివేత

- మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ శ్రేణులు, హిందూ సంఘాలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ సప్తగిరి కాలనీలో ఉన్న వినాయక మండపాన్ని మున్సిపల్ సిబ్బంది నేలమట్టం చేశారు. శనివారం విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంఘాలు పెద్దఎత్తున బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వద్దకు వచ్చి ధర్నా నిర్వహించారు. కమిషనర్, మేయర్, 28వ డివిజన్ కార్పొరేటర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. సప్తగిరి కాలనీవాసులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ధర్నాలో పాల్గొన్న బీజేపీ మహేశ్వరం నియోజవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. హిందూ మనోభావాలను దెబ్బ తీస్తే సహించేది లేదన్నారు. సప్తగిరి కాలనీలోని పార్కు స్థలంలో వినాయక మండపాన్ని నిర్మించుకొని గత కొన్నేళ్లుగా గణేశ్ నవరాత్రులు, దేవి నవరాత్రులు కాలనీవాసులు నిర్వహించుకుంటున్నారన్నారు. కాలనీవాసులపై కక్షగట్టి జేసీబీతో కూల్చి వేయించడం దారుణమన్నారు. దీనికి బాధ్యత వహించి కమిషనర్‌ను బర్తరఫ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూల్చివేసిన చోటే రెండు రోజుల్లో మండపాన్ని తిరిగి నిర్మించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న డీడీ డాక్టర్ మీర్జా అలీ బేగ్

సైదాబాద్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ పొందడం తప్పనిసరి అని జువైనల్ వెల్ఫేర్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీ బేగ్ అన్నారు. శనివారం సైదాబాద్‌లోని జువైనల్ వెల్ఫేర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్ట్రక్టర్ ప్రకాష్, ఆఫీస్ సబార్డినేట్ రమేష్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఇరువురు దంపతులను సంస్థ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీర్జా అలీ బేగ్ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన తమ విభాగం ఉద్యోగులు ఇప్పటి నుంచి కుటుంబానికి సమయం కేటాయిస్తూ సామాజిక సేవలో కూడా ముందుండాలని సూచించారు. వారి శేష జీవితం సుఖమయంగా సాగాలన్నారు.కార్యక్రమంలో జువైనల్ వెల్ఫేర్ విభాగం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగార్జున స్కూల్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే


ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న చైర్మన్ విఠల్‌రెడ్డి, విద్యార్థులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ శ్రీనివాసపురం కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్త విద్యార్థులు పాత విద్యార్థులతో కలిసి పోవడానికి ఈ ఫ్రెషర్స్ డే దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రాజశేఖర్, సీఏఓ శేషారావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టౌన్‌ప్లానింగ్'కు వన్నె తెచ్చిన రాజేందర్‌కుమార్


రాజేందర్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీగా పని చేస్తున్న రాజేందర్ కుమార్‌యాదవ్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డీసీలు ముకుందరెడ్డి, ఆంజనేయులు మాట్లాడుతూ, టౌన్ ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదులు లేకుండా రాజేందర్ కుమార్ సేవలందించారని వారు పేర్కొన్నారు. ఫిర్యాదులతో నిత్యం సతమతమయ్యే విభాగం టౌన్ ప్లానింగ్ అని, అలాంటి విభాగానికి రాజేందర్‌కుమార్ వన్నే తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో జోనల్ సీపీ ప్రసాద్‌రావు, ఎస్ఈ అశోక్‌రెడ్డి, వెటర్నరీ డీడీ రంజిత్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

1000 ఎంఎం డయా పైప్‌లైన్ మంజూరు చేయండి


జలమండలి ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నుంచి సరూర్‌నగర్ చెరువు వరకు సీఎం రోడ్డు మీదుగా 1000 ఎంఎం డయా పైప్ లైన్ మంజూరు చేయాలని శనివారం లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ, నవోదయ కాలనీ, శాతవాహననగర్, కాకతీయ కాలనీ, మైత్రీనగర్, సౌభాగ్యనగర్, అధికారినగర్, ధర్మపురి కాలనీ, సాయిరాంనగర్ కాలనీ, జనప్రియ కాలనీల్లో డ్రైనేజీ, వరదనీటి సమస్యల పరిష్కారం కోసం ఈ పైప్‌లైన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కారానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.

చెట్లను నరికివేసే వారిపై చర్యలు తీసుకోండి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని నాగార్జునాసాగర్ రహదారిపై ఇరువైపులా ఉన్న కాలనీల్లో ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సెంటర్ ఫర్ సోషియో కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సెక్రటరీ సన్నీ హెరాక్లియస్ అన్నారు. హస్తినాపురం పరిధిలోని టీచర్స్ కాలనీలో కొంత మంది వ్యక్తులు ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తున్నారని తెలుసుకున్న ఆయన ఘటనా స్థలానికి వెళ్లి చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని గుర్రంగూడ ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు హుటాహుటిన టీచర్స్ కాలనీలో చెట్లను తొలగిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కాగా ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా చెట్లను తొలగిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

నేతాజీ పొదుపు సంఘానికి అవార్డు

మహేశ్వరం: సమాఖ్య పొదుపు సంఘంలో సభ్యులకు రుణాలు సక్రమంగా ఇచ్చి, సకాలంలో వసూలు చేసినందుకు గాను మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామ నేతాజీ పొదుపు సంఘం ఉత్తమ అవార్డు అందుకుంది. శుక్రవారం రాత్రి శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో అభ్యుదయ సమాఖ్య 12వవార్షిక మహా సభను సమాఖ్య సభ్యులు నిర్వహించారు. మన్సాన్‌పల్లి నేతాజీ పొదుపు సంఘంలో సుమారు 700 మంది సభ్యులు చేరగా, సుమారు రూ.2కోట్ల రూపాయలు జమయ్యాయని సంఘం సభ్యులు తెలిపారు. ఈ సభలో నేతాజీ పొదుపు సంఘం సభ్యులకు రుణాలిచ్చి, సకాలంలో సభ్యుల నుంచి వసూలు చేసినందుకు ఎక్కువ మంది సభ్యులను సంఘంలో చేర్పించారు.సభ్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందించినందుకు సంఘ సభ్యులను అభ్యుదయ సమాఖ్య అధ్యక్షుడు చింతోజీ శ్రీనివాసచారి జ్ఞాపికను అందజేసి అభినందించారు.

దొంగ అరెస్ట్.. గొలుసు స్వాధీనం

హస్తినాపురం: గొలుసు స్నాచింగ్ చేసి తప్పించుకొని తిరుగుతున్న ఓ దొంగను వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా రాయపోల్ గ్రామానికి చెందిన పోలమోని శివకుమార్ (23)నగరంలోని కల్యాణి జ్యువెలర్స్‌లో పని చేస్తున్నాడు. ఈనెల 26వ తేదీ రాత్రి 9 గంటలకు ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి బీఎన్‌రెడ్డినగర్ ఎస్‌కేడీ నగర్ చౌరస్తాలో శ్రీలేఖ అనే మహిళ మెడలో నుంచి తులం బంగారు గొలుసును తెంచుకొని పారిపోయాడు. బాధితురాలు అదే రోజు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలా ఉండగా, శనివారం ఉదయం బీఎన్ రెడ్డినగర్ చౌరస్తాలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు.. ద్విచక్ర వాహనంపై దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్న శివకుమార్‌ను ఆపి ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బీఎన్‌రెడ్డి నగర్‌లో ఈనెల 26న మహిళ మెడలో తులం బంగారు గొలుసు స్నాచింగ్ చేశానని, దానిని ఇప్పుడు అమ్మేందుకు వెళ్తున్నానని చెప్పాడు. పోలీసులు శివకుమార్ వద్ద ఉన్న బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని అతడిని రిమాండ్‌కు తరలించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నాగోలు: ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన శ్రీకాంత్‌ను కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమీద డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బీనగర్ సద్గురు కాలనీలో చిన్నారిని, వారి కుటుంబ సభ్యులను ఫైమీద పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బతుకు తెరువు కోసం భార్య పిల్లలతో నగరానికి వచ్చిన వారిపై ఇలాంటి ఘటనలకు పాల్పడటం దురదృష్టకరమని అన్నారు. చిన్నారిపై లైంగిక దాడి యత్నించిన నిందితుడు శ్రీకాంత్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. త్వరగా చిన్నారి కోలుకోవాలని ఆకాంక్షించారు. పలువురు మహిళా సమాఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథలకు ఎస్‌కే ఫౌండేషన్ చేయూత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ దివ్యాంగులకు ఎస్‌కే ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. ఆశ్రమంలో 150 మంది మానసిక దివ్యాంగుల నిరాశ్రయులకు ఆరు నెలలకు సరిపడా సుమారు రూ.5 లక్షల విలువచేసే నిత్యావసర సరుకులు అందజేశారు. బియ్యం, కందిపప్పు, నూనె, పిండి, ఇతర వంట సామగ్రి, వాటితో పాటు ఫ్యాన్లు, గ్రీజర్లు, మిక్సీలు, దుప్పట్లు ఉచితంగా అందజేశారు. అదేవిధంగా తుర్కయంజాల్‌లోని ఇందిరానగర్‌లో కిరణం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్‌హోమ్‌లోని సుమారు 50 మంది విద్యార్థులకు బుక్స్, బ్యాగు లు, దుప్పట్లు, కంప్యూటర్లు, చెప్పులు, బూట్లు పంపిణీ చేశారు.